ములుగు-జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం 24 నవంబర్ 2023




# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## ధరణితోనే నాకు పట్టా అయింది

ములుగు, నవంబర్ 23(నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌తోనే నా భూమి పట్టాకు ఎక్కింది. అంతకుముందు తహసీల్దార్ ఆఫీసు చుట్టూ తిరిగిన. అయినా కాలేదు. పట్వారీలు తప్పించుకునే వాళ్లు. 2021లో ధరణికి దరఖాస్తు చేయగానే ఎకరం పొలానికి, 30 గుంటల చెలుకకు పట్టా వచ్చింది. ఇంకా 30 గుంటల భూమికి పట్టా రావాల్సి ఉంది. సార్లను అడిగితే ధరణి పోర్టల్ ఆప్షన్ వచ్చినంక అయితదని చెప్పిన్రు. పట్టా అయిన భూమికి రైతుబంధు వస్తాంది. అప్పట్ల లోన్‌లు తీసుకునేటప్పుడు ప్రతిసారి బ్యాంకు వాళ్లు పహాణి నకల్‌లు అడిగేది. వాటి కోసం తహసీల్ ఆఫీసుల చుట్టూ తిరుగుడు, పట్వార్లకు పైసలిచ్చుడు గిదే కథ ఉండేది. ఇప్పుడు ఆ బాధలు లేవు. ధరణి పాసుబుక్ తీసుకొని బ్యాంకుకు పోతే లోన్ ఇచ్చిన్రు. ఊకూకే పహాణి నకల్ తీసుకునే పని తప్పింది. తెలంగాణ వచ్చిన కాన్నుంచి కరెంట్ బాధ తప్పింది. ఎరువులు, పురుగు మందులు కూడా అదునుకు దొరుకుతానయ్. తెలంగాణ సర్కార్ ఇప్పటి వరకైతే రైతులకు మంచే చేసింది.

- చింతల రవి, రైతు,
రాంనగర్, ములుగు మండలం




## రేవుకచ్చిన ఎవుసాన్ని ఖరాబు చేయద్దు

- మూడు గంటల కరెంటు ఏ మూలకు సరిపోదు
- ధరణి వద్దంటున్న ఆ పార్టీని ఎవరూ నమ్మరు
- దళారుల రాజ్యం రానే వద్దు
- మునుపటి రోజులు చీకటి రోజులే
- స్పష్టం చేస్తున్న రైతులు, ప్రజలు
- అండగా ఉన్న బీఆర్ఎస్‌కే మద్దతంటూ జేజేలు

*'కాంగ్రెస్ హయాంల రాత్రింబవళ్లు కలిపి రైతులకు కరెంటిస్తే బావుల కాడనే కాపుగాసినం. సబ్ స్టేషనోళ్లకు ఫోన్‌జేసి కరెంటు ఎప్పడస్తదని అడిగితే మాకేం తెల్వదు.. పైననే పోయిందనేటోళ్లు.. రాత్రిపూట టార్చిలైట్లు పట్టుకొని బాయిల కాడికి పోయి నీళ్లు పారించినం. గంతెందుకు ఊళ్లె ఎవలన్న సచ్చిపోతె స్నానాలకు కూడా మోటరు వెట్టుదామంటే కరెంటు ఉండకపోవు' అంటున్నారు రైతులు. కాంగ్రెస్ పాలన అంతా చీకటి రోజులని, తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ పాలనలోనే తమ బతుకులు బాగుపడ్డాయని చెబుతున్నారు. నాడు ఎరువులు, విత్తనాల కోసం క్యూలో నిల్చునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు దేనికీ బాధపడే పరిస్థితి లేదని అంటున్నారు. ధరణిని తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యమే వస్తదని, రోజురోజుకూ పంచాయితీలు పెరుగుతయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారు వల్లనే భూములకు విలువ పెరిగిందని, ఇప్పుడు మళ్లీ రైతులను ఆగంజేసేందుకు కాంగ్రెస్ నాయకులు ఏవేవో మాట్లాడుతున్నారని మండిపడుతున్నారు. 'రైతుల గురించి ఏనాడూ ఆలోచించని కాంగ్రెస్ మాకెందుకు.. ఎప్పుడూ మా శ్రేయస్సు కోరే కేసీఆరే మళ్లీ రావాలి' అని కుండబద్దలు కొడుతున్నారు.*

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 23

## సీఎం కేసీఆర్ వల్లే కరెంట్ కష్టాలు తీరినయ్

సీఎం కేసీఆర్ మా కష్టాలు, ఇబ్బందులను గుర్తెరిగి 24 గంటల కరెంట్‌తో పాటు రైతుబంధు ఇచ్చిండు. రుణ మాఫీ చేసిండు. వ్యవసాయంపై అవగాహన లేని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు కేవలం 3 గంటల కరెంట్ సరిపోతుందని అనడం విడ్డూరంగా ఉంది. భూస్వాములు తప్ప రైతులెవ్వరూ 10 హెచ్‌పీ మోటర్లు వాడరు. ఐదు నుంచి పదెకరాలున్న రైతులు కూడా 3 హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లే వాడుతరు. సామాన్య రైతులు 10 హెచ్‌పీ మోటర్లు ఎందుకు వాడుతరు?. వ్యవసాయ బావులకు, బోర్లకు ఏ రైతు కూడా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టడు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా 24గంటలు కరెంట్ ఇస్తుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం ఓట్ల కోసం ఇలా రాజకీయలు చేస్తున్నారు. అందుకే 24గంట ల కరెంట్ సరఫరా చేస్తున్న కేసీఆర్ సర్కారుకే రైతులమంతా అండగా ఉంటం.

- బోయిని రమేశ్,
వేశాలపల్లి, భూపాలపల్లి మండలం





## రైతులను ఆగం చేసేందుకే రేవంత్ కుట్రలు

మహదేవపూర్, నవంబర్ 23 : గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలతో మస్తు గోసపడ్డం. ఆనాడు పడ్డ కష్టాన్ని తలుచుకుంటెనే భయమైతాంది. అప్పుడు ఎంతో ఇబ్బంది పడుకుంట పడి వ్యవసాయం చేసినం. తెలంగాణ వచ్చినంకనే 24గంటల కరెంట్‌తో రైతుల కష్టాలు తీరినయ్. రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తా, బాయిల కాడ 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి, కాంగ్రెసోళ్లు అంటున్రు. వాళ్లు చెప్పినట్లు మూడు గంటల కరెంట్‌తో ఒక ఎకరం కూడా పారదు. నారుమడి కూడ తడవదు. ఇగ 10 హెచ్‌పీ మోటర్ పెట్టాలంటే ఎంత ఖర్చు కావాలె?. అది సాధ్యమయ్యే పనేనా?. ఒకవేళ పెట్టుకున్నా కరెంట్ లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. తెలంగాణ పచ్చగ ఉంటే చూసి ఓర్తలేరు గీ కాంగ్రెసోళ్లు. పూటకో మాట చెప్పుకుంట రైతులను ఆగం చేత్తాన్రు. సీఎం కేసీఆర్‌తోనే నిరంతర కరెంట్, సంక్షేమ పథకాలతో రైతులు సంతోషంగా ఉన్నరు. మంచిగ బతుకున్న రైతులను ఆగం చేసేందుకే రేవంత్‌రెడ్డి కుట్రలు చేత్తాండు. మళ్ల కేసీఆర్ సార్ అత్తెనే రైతులు ఆనందంగా ఉంటరు.

- సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మాపూర్,
మహదేవపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## ధరణితో భూముల పంచాయితీ తప్పింది

ములుగు రూరల్, నవంబర్ 23 : ధరణి పోర్టల్ వచ్చినకాన్నుంచి ఊర్లలో రైతులకు భూముల పంచాయితీ తప్పింది. అప్పట్ల పట్వార్లు అప్పుడప్పుడు ఒకల భూమిని ఇంకొకలకు డబ్బులు తీసుకొని ఎక్కించేటోళ్లు. దీనివల్ల రైతులకు గొడవలు జరిగి పంచాయితీల కోసం పెద్ద మనుషుల చుట్టూ తిరిగేది. ఇప్పుడు ధరణి పోర్టల్‌లో ఒక్కసారి భూమి ఎక్కిందంటే ఎవలన్న భూమి మీదికి వస్తరో అనే బాధ, భయం పోయింది. ఎన్కటి నీటి తీరువ, కరెంట్ బిల్లులు, లోన్లు కట్టాలని అప్పటి ప్రభుత్వాలు రైతులను పీడిచ్చుక తినేది. ఇప్పుడు కరెంట్ బిల్లులు కట్టుడు లేదు. నీటి తీరువ బంద్ అయింది. లోన్‌లు కూడా కొంత మాఫీ అయినయ్. మిగిలిన బాకీలు అప్పటి లెక్క అధికారులు కూడా జబర్దస్ చేసి అడుగుతలేరు. నా పేరు మీద 5 ఎకరాలు, మా అమ్మ పేరు మీద 5 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి రైతుబంధు సాయం వస్తాంది. ధరణి తెచ్చి కేసీఆర్ మంచిచేసిండు. ధరణిని బంద్ చేయకుండా ఇలాగే కొనసాగించాలి.

- రాయిశెట్టి కుమారస్వామి, రైతు,
జంగాలపల్లి, ములుగు మండలం





## పైరవీకారులకు మళ్ల మోపైతరు..

రేగొండ, నవంబర్ 23 : ధరణి రద్దు చేసినట్లయితే ఇగ పైరవీకార్లు మోపైతరు. వాళ్లకు కాసుల పంటే. అప్పట్ల ఆఫీసులో ఏ పని కావాలన్నా పైసలు ఇచ్చి నెలలకు నెలలు తిరిగెటోళ్లం. కేసీఆర్ సార్ రైతుల గోస చూడలేక ధరణి తీసుకొచ్చి పైసా ఖర్చులేకుంట అప్పటికప్పుడె పనయ్యేటట్టు ఆన్‌లైన్ తీసుకచ్చిండు. దీని వల్ల రైతు సమస్యలు తొందరగనే పరిష్కారం అయితానయ్. కాంగ్రెస్ ఆధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామంటున్నరు. అంటే మళ్ల పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తది. అదే జరిగితే మళ్ల మాకు కష్టాలు మొదలైనట్టే. కానీ మేం కాంగ్రెస్‌ను నమ్మం.

- శంకర్‌రెడ్డి, రామగుండాలపల్లె, రేగొండ

## భూములు గుంజుకునేందుకే ధరణి వద్దంటుండ్రు..



మల్హర్, నవంబర్ 23 : ధరణి అమలు చేయడం వల్ల భూ సమస్యలు చాలావరకు పరిష్కారం అయినయ్. ఇప్పుడు దళారీ వ్యవస్థ అనే ముచ్చటనేలేదు. ధరణిని తీసేస్తమని కాంగ్రెసోళ్లు చెప్పడం కరెక్ట్ కాదు. అలా అయితే మళ్లా భూముల కోసం కొట్లాటలు అయితయి. దళారీ వ్యవస్థ పెరుగుతుంది. చేయి తడపనిదే పని కాదు. ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తది. ఇప్పుడున్న ధరణి ఎంతో మంచిగున్నది. ధరణితో దొంగ రిజిస్ట్రేషన్లు అయితలేవు. గత ప్రభుత్వాలున్నప్పుడు భూమి ఒకరిది అయితే రికార్డుల్లో పేరు ఒకరిది ఉండేది. అక్కడ కిరికిరి మొదలైందంటే అది ఒడిసేది కాదు. తహసీల్ ఆఫీస్ చుట్టు చెప్పులు అరిగేలా తిరుగుడు, లంచం ఇచ్చుడు ఉండేది. రైతుల పేర్లు మాయం అయి పెద్ద పెద్ద లీడర్ల పేర్లు, వాళ్ల ఇంట్లోళ్ల పేర్లు రికార్డులకు ఎక్కేది. అది మార్చాలని వాళ్ల దగ్గరకు పోయేది. ఆఫీసోళ్లు వాళ్ల మాట తప్ప ఇంకొకలు చెప్పేది ఇనకపోతుండె. ధరణితో ఇప్పుడు అసొంటి బాధలు మొత్తం పోయినయ్. విరాసత్ చేయాలన్నా, భూమిని పంచాలన్నా అందరూ కలిసి ఆఫీసుకు పోయి సారు ముందట ఒప్పుకుంటనే అయితాంది. రైతుల భూములు గుంజుకునేందుకే కాంగ్రెస్ నాయకులు ధరణి తీసేస్తమని అంటుండ్రు. కాంగ్రెస్‌ను నమ్మితే తలకాయ నొప్పే.


-బానోత్ రాజునాయక్, అన్‌సాన్‌పల్లి, మల్హర్

## రైతును రాజును చేసింది కరెంటే

గణపురం, నవంబర్ 23 : తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తుండటంతో సాగు రూపురేఖలు మారి పోయాయి. హరితహారంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో ప్రస్తుతం రెండు పంటలు పండిస్తున్న. రైతును రాజును చేసింది కరెంటే. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ అప్పుడు ఏం చేయలె. కొత్తగా సాగుకు 3 గంటల కరెంట్ ఇచ్చి 10 హెచ్‌పీ మోటర్లు పెడుతామంటున్నరు. కాంగ్రెస్ నాయకులకు ఎప్పుడు రైతులపై చిన్న చూపే. రైతు బాగుపడటం వాళ్లకు ఏ మాత్రం ఇష్టం లేదు. కాంగ్రెసోళ్ల మాటలింటే రైతులు కరెంట్, ఎరువులు, విత్తనాల కోసం రోడ్డెక్కాల్సిందె. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే కరెంట్‌తో పాటు ఉన్న భూగర్భ జలాలు ఎండిపోయి, మా బతుకులు ఆగమైపోతయ్. రైతుల మీద మళ్లీ కుట్రలు చేసే ప్రయత్నం చేస్తున్నరు. గిది తెల్వకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటు. రైతులను మోసం చేసే కాంగ్రెస్‌ను ఓడించుడే.

- ఏడెల్లి మల్లారెడ్డి, రైతు, లక్ష్మారెడ్డిపల్లి,
గణపురం మండలం.






## ఇప్పుడున్న కరెంటే మంచిది

ములుగు, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాకముందు కరెంట్‌కు మస్తు తిప్పలయ్యేది. కరెంట్ బాధలు తప్పినయ్. ఇప్పుడు 24గంటల కరెంట్ ఇస్తేనే పంటలు మంచిగ పండుతానయ్. ఇప్పుడు కాంగ్రెసోళ్లు అచ్చి 3గంటల కరెంట్ ఇస్తమంటే ఏందన్నట్టు. ఇదివరకు కరెంట్ సక్కగ లేకనే ఆగమైతిమి. మళ్ల తెలంగాణ రాక ముందు లెక్క గోస పడల్నా ఏంది? తెలంగాణ రాక ముందు కాంగ్రెస్ పాలనల రైతులకు కరెంట్ ఇచ్చింది లేదు మన్ను లేదు. వ్యవసాయం అంటే తెల్వనోళ్లే మూడు గంటల ముచ్చట చెప్తరు. టీవీలలో చూస్తే ఆనాడు రైతులు పడ్డ కష్టాలు యాదికస్తున్నయ్. 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటరు ఎకరం పారిచ్చుడు అనేది రైతులతోని కాని పని. ఇప్పుడున్న 24గంటల కరెంటే మంచిగున్నది. గిట్టుబాటు ధర పెంచితే చాలు.



- రంగరబోయిన ఓదెలు,
జంగాలపల్లి, ములుగు మండలం

## ఆ దరిద్రపు రోజులు మళ్లీ రావద్దు

రేగొండ, నవంబర్ 23 : ఆనాడు మా ఆయ్య, అవ్వ ఎవుసం కోసం పడ్డ కట్టం పగోనికి కూడా రావొద్దని ఆ దేవునికి మొక్కుతున్న. ఆ రోజుల్లో బాయికాడికి పోవాలంటెనే దుఃఖం అచ్చేది. ఇంటికి రాంగనె కరెంటు వచ్చిందని తెల్వంగనే అట్లనే ఉరికెటోళ్లం. అక్కడికి పోయి మోటరు ఒత్తంగనె గుయి.. గుయి అని ఒక గంట మోటరు పోయంగనే కరెంట్ బందయ్యేది. ఇగ రాత్రీ పగలు తేడాలేకుండా బాయికాడనే పండెటోళ్లం. మా అయ్య, అవ్వ, నేను సుత తెల్లందాక, పొద్దుగూకే దాక తిండీతిప్పలు లేకుండా గోసపడేది. ఎప్పుడు తినేదో, ఎప్పుడు పండేదో ఆ దేవునికే ఎర్క. కాంగ్రెస్ పాలనలో ఎవుసం చెయ్యాలంటెనే భయంగా ఉండేది. తెలంగాణ వచ్చి కేసీఆర్ సార్ వచ్చినంక మాకు 24గంటలు కరెంట్ అత్తాంది. మాకు తీరిక దొరికినప్పుడు పోయి నీళ్లు పెట్టుకుంటున్నం. రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంట్ సాలు.. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటాండు. ఆయనొత్తే మళ్ల పాతరోజులే అత్తయి. పోయిపోయి కష్టాలు తెచ్చుకుంటమా?. కాంగ్రెస్‌ను నమ్మి పోసపోతమా?

- వెన్నల శ్యాం, యువ రైతు, రేగొండ

